క్లుప్తంగా

అడవి జాతి మొక్కల పెంపకంపై అవగాహన



ముప్పాళ్ళ: రైతులు వ్యవసాయ భూమిలో అడవి జాతి మొక్కలను నాటితే అదనపు ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. చాగంటివారిపాలెం రైతు సేవా కేంద్రంలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకం కార్యక్రమంపై రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చెట్ల పెంపకం ప్రాధాన్యతను వివరించారు. అదనపు ఆదాయమిచ్చే ఉద్యాన మొక్కలు, సాగు చేసే విధానాన్ని ప్రోగ్రాం సీసీ వెంకటేష్ వివరించారు. ముప్పాళ్ళ ఏఈఓ పావని రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతిలో ఉద్రిక్తత



క్రోసూరు: పారుపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. వైస్ ఎంపీపీ విప్పర్ల వెంకట్రామిరెడ్డి వివరాల మేరకు.. పారుపల్లి ఒకే సామాజిక వర్గానికి చెందిన గ్రామం. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేస్తున్నారు. కొంత మంది పవన్ కల్యాణ్ పుట్టిన రోజు అంటూ బాణసంచా పేల్చారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. అనంతరం జనసేన పార్టీ శ్రేణులు రోడ్డుకు అడ్డంగా కంప, తూము పెట్టారు. క్రోసూరు ఎస్ఐ షఫీకి తెలపగా పోలీసులు వచ్చి రోడ్డుపై అడ్డుగా పెట్టిన కంప, తూమును తొలగించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



నకరికల్లు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మణికంఠ సూచించారు. మండలంలోని పలుగ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, జ్వరం లాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, కాచి చల్లార్చిన నీటినే తాగడం చేయాలన్నారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు ఉన్నా వెంటే సంప్రదించి తగిన మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతాల పరిశీలన



ముప్పాళ్ళ: గ్రామాల్లో వినాయక చవితి మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు తెలిపారు. మండల పరిధిలో వినాయక నిమజ్జనానికి అవకాశమున్న దమ్మాలపాడులోని గుంటూరు బ్రాంచి కాలువ, ముప్పాళ్లలోని పెదనందిపాడు బ్రాంచి కాలువ, రామకృష్ణాపురం కాలువ, నార్నెపాడు వెళ్లే దారిలోని గుంటూరు బ్రాంచి కాలువను మంగళవారం సందర్శించారు. నిమజ్జనం పూర్తయ్యేవరకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శాంతియుతంగా ఊరేగింపు జరుపుకోవాలని, ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే పూర్తి బాధ్యత కమిటీదేనన్నారు. రోడ్లపై పందిళ్లు పెట్టకూడదని, బ్యానర్లు, ఫ్లెక్సీలతో రాకపోకలకు అంతరాయం కలిగించకూడదని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని చెప్పారు.

బయట పడుతున్నారు



కుళ్లిపోయిన మినుము పంట

అమరావతి: మండలంలో గత నాలుగు రోజులుగా వాగులతో పాటు కృష్ణానది ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగాయి. మంగళవారం నీటి మట్టం తగ్గడంతో మొక్కలు చనిపోయి ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మెట్ట ప్రాంతాలైన మల్లాది, పొందుగల, మునగోడు, ముత్తాయపాలెం జూపూడి, దిడుగు, ధరణికోట, పెదమద్దూరు, అమరావతి, నరుకుళ్లపాడు, చావపాడు, ఎండ్రాయి, వైకుంఠపురం పంట పొలాల్లో పూర్తిగా మొక్కలన్నీ చనిపోయాయి. పత్తి, మిరపనారు, వరి, కంది, పసుపు, వరినారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొక్కలు పూర్తిగా చనిపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు రైతులు పత్తి పైరు ఎకరాకు రూ.15 వేలు, మిరపలో రూ.10వేలు, పసుపు పంటలో రూ.15 వేలు, వరిలో రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టారు.

బయటపడుతున్న ఇళ్లు..

వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఇప్పుడిప్పుడే ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో రెండు అడుగుల మేర వరద నీరు నిలిచి ఉంది. పంట పొలాల్లోకి మరో రెండు రోజులు వర్షం రాకుండా ఉంటేనే సాధ్యమవుతుంది. మండలంలోని వాగులన్నీ సాధారణ స్థితికి చేరుకోగా పెదమద్దూరు వాగు లోలెవల్ చప్టాపై ఇంకా రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. కృష్ణానది సాధారణ స్థితికి చేరి అమరేశ్వర ఘాట్ వద్ద మెట్ల పైకి ప్రవహిస్తోంది.

వరద బాధితులకు ఆహార పదార్థాలు

సత్తెనపల్లి: డీఆర్‌డీఏ, వెలుగు ఆధ్వర్యంలో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి విజయవాడ తుపాను వరద బాధితులకు పులిహోర, బిస్కెట్ ప్యాకెట్లను మంగళవారం తరలించారు. సత్తెనపల్లి నుంచి 500, ముప్పాళ్ల నుంచి 500 పులిహోర ప్యాకెట్లు, రాజుపాలెం, నకరికల్లు మండలాల నుంచి వెయ్యి బిస్కెట్ ప్యాకెట్లు వరద బాధితులు సహాయార్థం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో పంపారు.డీఆర్‌డీఏ, వెలుగు ఏపీఎంలు, సిబ్బంది ఉన్నారు.



విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం తీసుకెళ్తున్న ఆహార పదార్థాలు

పత్తి రైతులను ఆదుకోవాలి

పెదకూరపాడు: వరద ఉధృతిలో నష్టపోయిన పత్తి రైతులకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలని పెదకూరపాడు జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి డిమాండ్ చేశారు. పెదకూరపాడులో పేరమ్మ వాగు పరీవాహక పొలాల రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేందుకు వెంటనే వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు దానియేలుకు వినతిపత్రం అందజేశారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

క్రోసూరు: మండల కేంద్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు బుడగ జంగాల, చెంచు కాలనీల్లోని మంగళవారం ప్రభుత్వం తరుపున నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. చెంచు కాలనీలోని జేమ్స్ ప్రార్థన మందిరంలో బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు, బంగాళ దుంపలు, ఉల్లిపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లా చందమామ, మాజీ ఎంపీపీ అనుముల వెంకట్రామిరెడ్డి, మన్నెం శ్రీనివాసరావు, షేక్ సలాం, యోహాను, చంటి, చిల్కా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయల పంపిణీ

బెల్లంకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల సమీపంలో గుడారాల్లో నివాసం ఉంటున్న బుడగ జంగాలకు మంగళవారం తహసీల్దారు అఫ్షపున్నీసా బేగం పండ్లు, వాటర్ బాటిళ్లు, కూరగాయలు, సరుకులు పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలో వారికి వసతి కల్పించారు. వర్షాలు తగ్గడంతో గుడారాలకు తిరిగి వెళ్లిన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పండ్లు, కూరగాయలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం, వీఆర్వో వెంకయ్య పాల్గొన్నారు.



పండ్లు, వాటర్ బాటిళ్లు అందజేస్తున్న తహసీల్దారు, నాయకులు

దెబ్బతిన్న వేరుశనగ పంట పరిశీలన

రాజుపాలెం: మండలంలోని బీరవల్లిపాయ గ్రామ పొలాల్లో మొలకెత్తిన వేరుశనగ పంటను మండల వ్యవసాయాధికారి వెంకట నర్సయ్య మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన పశుపులేటి వెంకటేశ్వర్లు తన ఏడెకరాల పొలంలో వేరుశనగ ఓదెలు పెట్టాడు. వర్షాలకు ఓదెలు కుళ్లిపోయి వేరుశనగ మొలకెత్తాయి. ఏఓ పంటను పరిశీలించి 40 శాతం నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారంపై ఆదేశాలు వచ్చిన వెంటనే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. వ్యవసాయ సహాయకురాలు సుశీల ఉన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకట నర్సనయ్య

మెప్మా సమైఖ్యల లావాదేవీలపై ఆడిట్



మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం జిల్లాకు చెందిన ప్రైవేటు ఆడిటర్లు 2023 – 24 స్లమ్ ఏరియా సమైఖ్యల లావాదేవీలు, రుణాలు, రికవరీలు గ్రూపుల లావాదేవీలపై ఆడిటింగ్ నిర్వహించారు. మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లాకు చెందిన ప్రైవేటు సంస్థ అజాద్ అండ్ కో 31 సమైఖ్యలకు సంబంధించిన గ్రూపు రికార్డులను తనిఖీ చేసింది. ఆడిటర్లు రాజేష్, రవి ఉన్నారు.

రైలు నుంచి పడి ఒడిశా వ్యక్తికి గాయాలు



దాచేపల్లి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ప్రయాణికుడు తీవ్రంగా గాయపడిన ఘటన నడికుడి రైల్వే జంక్షన్‌లో మంగళవారం జరిగింది. ఒడిశా ప్రయాణికుడు(32) శబరి ఎక్స్‌ప్రెస్ రైలు నడికుడి జంక్షన్‌లో ఆగి కదులుతున్న క్రమంలో జారి కిందపడ్డాడు. రైలు బలంగా ఢీ కొట్టడంతో అతని కుడి చేయి పూర్తిగా విరిగి రైలు పట్టాలపై పడింది. అతనిని ప్లాట్‌ఫాంపై చేర్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. ప్రయాణికుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆక్రమణ పేరుతో..పేదల ఇళ్లు కూల్చేందుకు ఉపక్రమణ

- లెంటల్ లెవల్ వరకు వచ్చిన ఇల్లు నేలమట్టం
- మరో ఇల్లు పాక్షికంగా కూల్చివేత

అచ్చంపేట: ఆక్రమణల పేరుతో రెవెన్యూ, పోలీస్ అధికారులు నిర్మాణంలో ఉన్న ఇంటిని పొక్లెయినర్‌తో పూర్తిగా కూల్చేయగా, మరో ఇంటిని పాక్షికంగా పడగొట్టారు. స్థానిక చామర్రు రోడ్డులో నివాసితులు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చామర్రు రోడ్డు తూర్పు పక్కన ఆక్రమించుకుని కొంతమంది పేదలు చాలా ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ నివాసాలకు వెనుక కొంత మంది రైతుల భూములున్నాయి. తమ భూములకు వెళ్లేందుకు బాటు చూపించాలంటూ రైతులు కోర్టును ఆశ్రయించారు. రైతు భూముల్లోకి వెళ్లేందుకు అనువుగా బాట చూపించాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అప్పటి తహసీల్దారు సుమారు 10 రోడ్ల వరకు సరిపోయే స్థలాలను గుర్తించి వాటిలో ఎవరూ ఇళ్లు కట్టుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. ఆ ఖాళీ స్థలాలను వదిలేసి, మిగిలిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. గుర్తించిన స్థలాలు తమకు సరిపోవని ఇంకా వెడల్పు గల రోడ్డు చూపించాలంటూ గతంలోనే రైతులు అధికారుల ద్వారా ప్రయత్నం చేశారు. అప్పుడు కూడా స్థానికులు ఆందోళన చేయడంతో అధికారులు విరమించుకున్నారు. ఇప్పుడు మళ్లీ రైతులు తమకు రోడ్ల కోసం గతంలో గుర్తించిన స్థలాలు చాలవని రెవెన్యూ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకొచ్చారు. గత్యంతరం లేని పరిస్థితులలో ఆక్రమణలను తొలగించేందుకు పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు వెళ్లారు. గౌతుకట్ల లక్ష్మీనారాయణ అనే వ్యక్తి లెంటల్ లెవెల్‌కు నిర్మించుకున్న ఇంటిని పొక్లెయినర్‌తో నేలమట్టం చేశారు. రెంటపాళ్ల పుల్లమ్మకు చెందిన రేకుల ఇంటిని పాక్షికంగా పడగొట్టారు. ఇంతలో స్థానికులు వచ్చి అధికారులతో గొడవకు దిగారు. నిరుపేదలమైన తమ ఇళ్లపై ప్రతాపం చూపుతారా..? అంటూ ప్రశ్నించారు. 15 ఎకరాల పొలాలకు వెళ్లడానికి 11 దార్లు కావాలా అంటూ ప్రతి ఘటించారు. అధికారులు వెనుతిరగడంతో గొడవ తాత్కాలికంగా సద్దుమణిగింది.



నేలమట్టం చేసిన ఇంటివద్ద బాధితులు లక్ష్మీనారాయణ దంపతులు



అధికారుల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక నివాసితులు

15 ఎకరాల భూమికి వెళ్లడానికి ఎన్ని దార్లు కావాలి



రైతుల భూములకు వెళ్లడానికి 10 దార్లుకు కావలసిన స్థలాన్ని అధికారులు వదిలారు. అవి సరిపోవన్నట్లు ఇంకా వెడల్పాటి స్థలం కావాలని మాపై ప్రతాపం చూపిస్తున్నారు. కష్టపడి పైసా పైసా కుడబెట్టిన డబ్బుతో ఇల్లు నిర్మించుకున్నా. పైన కొన్ని రేకులు తొలగించారు. గోడ సగం వరకు పడగొట్టారు.

– రెంటపాళ్ల పుల్లమ్మ, బాదిత మహిళ, అచ్చంపేట

ఇల్లు మొత్తం నేలమట్టం చేశారు



ఇల్లు లెంటల్ వరకు నిర్మించుకున్నా. వాళ్ల భూములకు వెళ్లడానికి నా ఇల్లు ఎంత మాత్రం అడ్డం కాదు. కావాలనే మాపై కక్షగట్టి రాజకీయ కుట్రతో ఇల్లు పడేశారు. ఇప్పటి వరకు సుమారు రూ.6లక్షలపై గా ఖర్చు చేసా. మాకు ఇది తప్ప మరెక్కడా స్థలం లేదు.

– గౌతుకట్ల లక్ష్మీనారాయణ, బాధితుడు, చామర్రు.

ఆక్రమణలు తొలగించాల్సి ఉంది



తమ భూములకు వెళ్లడానికి రోడ్డు చూపించాలంటూ రైతులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించాల్సి ఉంది. గతంలో పనిచేసిన తహసీల్దారు రోడ్డు కోసం గుర్తించిన స్థలంలో గౌతుకట్ల లక్ష్మీనారాయణ ఇల్లు కొంతమేర నిర్మించుకున్నాడు. మరో మహిళ కొంతభాగంలో రేకుల ఇల్లు నిర్మించుకుంది. ఆక్రమణలను తొలగింపునకు ఎలాంటి నోటీసులు ఇవ్వాలిన అవసరం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మిగిలిన ఇళ్లవాళ్ల జోలికి వెళ్లే ప్రసక్తే లేదు.

–జి.శ్రీనివాసయాదవ్ , తహసీల్దారు, అచ్చంపేట

సస్యరక్షణతో నష్ట నివారణ



పిల్లుట్లలో మిరప సాగును పరిశీలిస్తున్న అధికారులు

మాచవరం: తక్షణం సస్యరక్షణ రక్షణ చేపడితే ఉద్యాన పంటలను కాపాడుకొని నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. పిల్లుట్ల, మల్లవోలు గ్రామాల్లో సోమవారం ఉద్యాన పంటలను ఆయన పరిశీలించి, రైతులకు తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. వర్షాలకు లోతట్టు పొలాల్లో నీరు నిలబడి పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అధిక తేమ కారణంగా వేర్ల ద్వారా మొక్కలకు సరైన పోషకాలు అందకపోవడం, తలలు వాల్చడం, ఉరకలెత్తడం, సూక్ష్మపోషక ధాతు లోపాలు ఏర్పడతాయని తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట దశ, ముంపు ఉధృతిని బట్టి సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను రక్షించుకొని, నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఆయన తెలియజేశారు. నష్ట నివారణ చర్యలను తెలియజేశారు.

ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న డాక్టర్, హెల్త్ సూపర్‌వైజర్

రాజుపాలెం: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వ్యాధులు ప్రభలకుండా ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులను కాన్పుకు మూడు రోజులు ముందుగానే వైద్యశాలకు తీసుకురావాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టాయని, గ్రామాల్లో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాచర్ల నియోజక వర్గ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు కొరటా వెంకటరమణ తెలిపారు. వాణి విద్యానికేతన్ ప్రిన్సిపాల్, అధ్యక్షులుగా కేవీ రమణ (7వ సారి), జెనిత్ స్కూల్ ప్రిన్సిపల్, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసులు, కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్, కోశాధికారిగా, చీఫ్ అడ్వైజర్‌గా రామకృష్ణశాస్త్రి, గౌరవాధ్యక్షుడిగా బి.వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా వేముల వెంకటేశ్వర్లు, కె.వెంకటరావు, జాయింట్ సెక్రెటరీలుగా డి.శ్రీనివాసరావు, వి.హరికా రెడ్డి, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావు, సబ్ ట్రెజరర్‌గా సురేష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉత్సవ అనుమతులకు 'సింగిల్ విండో'



సత్తెనపల్లి టౌన్ సీఐ బ్రహ్మయ్య

సత్తెనపల్లి: గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో విధానంతో అనుమతులను ప్రభుత్వం సులభతరం చేసిందని సత్తెనపల్లి టౌన్ సీఐ బి బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. గతంలో పురపాలక, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ శాఖల నుంచి ఎన్‌ఓసీ పత్రాలు తీసుకోవాల్సి ఉండేదని ఇకపై అలా తిరగాల్సిన అవసరం లేదన్నారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించదలచిన వారు వాట్సాప్ నంబర్ 79950 95800 లేదా గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి సచివాలయాల్లో, మీ సేవా కేంద్రాల్లో చలానా రుసుము చెల్లించి అనుమతులు పొందవచ్చని తెలిపారు.

దరఖాస్తు ఇలా..

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు పొందాలనుకునేవారు వాట్సాప్ నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపాలి. అనంతరం ఫోన్‌కు లింక్ వస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఆ తర్వాత గూగుల్ ఫాం ఓపెన్ చేసి అందుబాటులో ఉన్న కాలమ్స్‌ను పూర్తి చేసి సబ్మిట్ చేయాలి. గణేష్ ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యులు వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది తదితర వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలి.

అనుమతుల మంజూరు ఇలా..

దరఖాస్తులు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్తాయి. స్థానిక పోలీసు అధికారి ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖ సిబ్బంది బృందంగా ఏర్పడి మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శిస్తారు. ఏర్పాట్లను పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసీని జారీ చేస్తారు. క్యూ ఆర్ కోడ్ ను ల్యామినేషన్ చేసి మండపంలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలి.